క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



పొదలకూరు : మండలంలోని లింగంపల్లి పాఠశాలలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పొదలకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు పాఠశాల పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాంపై పిల్లలకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులు, ప్రోగాం ఆఫీసర్ నాహిద్, హెచ్‌ఎం నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ సభ్యత్వ నమోదు



పొదలకూరు : బహుజన టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదును శుక్రవారం చేపట్టారు. మండలంలోని అయ్యగారిపాళెం, అమ్మవారి పాళెం, తాటిపర్తి, తదితర గ్రామాల్లోని పాఠశాలలను బీటీఏ నాయకులు సందర్శించి సభ్యత్వాలను నమోదు చేశారు. జిల్లా ఆడిట్ సెక్రటరీ కృష్ణయ్య, షేక్ ఖాజారంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు కే కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభలు



ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు ,నిడిముసలి గ్రామాల్లో రీ సర్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో మొత్తం 21 వినతులు అందాయని డిప్యూటీ తహసీల్దార్(సర్వే) రవికుమార్ తెలిపారు. పల్లిపాడులో 9, పల్లిపాడులో 12 మంది రైతులు వినతులు సమర్పించారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ జీవన్‌కుమార్, మండల సర్వేయర్ హరనాథ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొడవలూరు: మండలంలోని గండవరం, రామన్నపాళెం, పద్మనాభసత్రం, కొత్తవంగల్లు, యల్లాయపాళెం సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎం రాములు శుక్రవారం తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ఉన్న అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం జరిగిన ఒకటో సెమిస్టర్ పరీక్షకు 1,552 మంది విద్యార్థులకు గానూ 1,397 మంది హాజరయ్యారన్నారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 7,371 మందికి గానూ 6,767 మంది హాజరయ్యారని, ఒకరిని డిబార్ చేసినట్లు వెల్లడించారు.

సౌరశక్తితో పర్యావరణ పరిరక్షణ

నెల్లూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు సౌరశక్తి వినియోగం ఎంతో దోహదపడుతుందని ఐఐటీ ముంబై ప్రొఫెసర్, సోలార్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ చేతన్‌సింగ్ సోలంకి పేర్కొన్నారు. కలివెలపాళెంలోని రెయిన్‌బో ఇంటర్నేషనల్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన ఎంపవరింగ్ ఇండియా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ఉపయోగాలను వివరించారు. సౌరశక్తి వినియోగం సకల జీవరాసి మనుగడకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సౌరశక్తిపై అవగాహన కల్పించేందుకు గానూ సోలార్ బస్సు యాత్రను 11 ఏళ్ల పాటు కొనసాగించనున్నామని, ఇప్పటికే మూడేళ్లు పూర్తయిందని చెప్పారు. సౌరశక్తి శాస్త్రవేత్త శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన నేత సీఎం జగన్

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నూతన పెన్షన్లను పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: దేశంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ముత్తుకూరులోని మత్స్యకళాశాల సమావేశమందిరంలో నూతన పెన్షన్లతో పాటు పెంచిన పింఛన్ మొత్తం రూ.3 వేలను లబ్ధిదారులకు మంత్రి కాకాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో కొత్త పెన్షన్ కావాలంటే జన్మభూమి కమిటీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయడమే కాకుండా ప్రతి నెలా 1వ తేదీ నాడే ఇంటి వద్దే పెన్షన్లను అందజేస్తున్నారని తెలిపారు. ఏడాదికి రెండుసార్లు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్న ఘనత కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 40,732 మందికి పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. ముత్తుకూరు మండలంలో 7,680 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని వివరించారు.

కుప్పానికి ఎయిర్‌పోర్టు తెస్తాడట

ఎన్నికలు సమీపించడంతో చంద్రబాబు అమలు చేయలేని హామీలు గుప్పిస్తూ మరోసారి ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నాడని మంత్రి కాకాణి మండిపడ్డారు. కుప్పంలో చంద్రబాబు ప్రసంగిస్తూ ఎయిర్‌పోర్టు తెస్తానని ప్రకటించడమే ఇందుకు నిదర్శమన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఒక్క మంచిపని కూడా చేయని చంద్రబాబు ఇప్పుడు మోసపూరిత మాటలతో మభ్యపెడుతున్నాడని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఆలపాక శ్రీనివాసులు, కాకి మస్తానమ్మ, ఎంపీటీసీ సభ్యులు రావి విజయకుమార్‌రెడ్డి, షేక్ నవీద్, చీకిరి శీనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

• ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి



భోజనం రుచి చూస్తున్న దేవి

మనుబోలు: 'ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.1800 కోట్లు ఖర్చు చేస్తోంది. అందుకనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని' రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి అన్నారు. మనుబోలు, మడమనూరులోని జెడ్పీ ఉన్నత, ఎంపీపీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని స్వయంగా రుచి చూశారు. ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలల్లో తినకుండా ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకోవడాన్ని గుర్తించి మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరాతీశారు. భోజనం ఎలా ఉంటుంది..పాఠశాలలో ఎందుకు తినడం లేదని విద్యార్థులను ప్రశ్నించగా వారు బాగా ఉందని సమాధానం ఇచ్చారు. విద్యార్థుల తీరును అనుమానించిన ఆమె కాగితంపై అభిప్రాయాలను రాసివ్వాలని కోరగా, భోజనం, కూరలు బాగుండడం లేదని, గుడ్లు సైతం ఒక్కోసారి కుళ్లిపోయి ఉంటున్నాయని తమ అభిప్రాయాలు తెలియజేశారు. స్పందించిన ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన ప్రొటీన్లు, కాల్షియం, మినరల్స్, విటమిన్లు సమపాళ్లలో అందేలా మెనూను రూపొందించారన్నారు. నాణ్యమైన భోజనం అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాన్ని కాపాడేలా నిర్వాహకులు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం తినేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో భోజనం చేస్తున్న, రిజిష్టర్‌లో నమోదు చేస్తున్న విద్యార్థుల సంఖ్యకు తేడా ఉంటుందని, లోపాలను సరిచేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డీఈఓ గంగాభవానీ, ఎంపీడీఓ ప్రసాద్, వీఆర్వో నాగార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలి



ఇంటింటి సర్వేను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి

పొదలకూరు : కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో చేపడుతున్న కుష్టు సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027 నాటికి దేశాన్ని కుష్టు వ్యాధి రహితంగా నిలిపేందుకు ప్రభుత్వం సర్వేలు చేపడుతుందని తెలిపారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే అంగవైకల్యం లేకుండా నివారించేందుకు అవకాశం ఉందన్నారు. చర్మంపై రాగి రంగు మచ్చలు కుష్టు లక్షణమని, ఎవరికైనా అలాంటి లక్షణాలు ఉంటే గుర్తించి సమీపంలో ఆస్పత్రులకు పంపాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు.

యూరియాను అధికంగా వాడొద్దు



వేరుశనగ పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ముత్తుకూరు: వరి పంటకు అధిక మోతాదులో యూరియా వాడొద్దని జిల్లా వనరుల కేంద్రం(ఆత్మ) డిప్యూటీ డైరెక్టర్ శివవన్నారాయణ సూచించారు. శుక్రవారం ముత్తుకూరులో ఆత్మ ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ లక్ష్మీమాధవి, ఏఓ గీతారాణి, కేవీకే శాస్త్రవేత్తలు విజయకుమార్, కిరణ్‌కుమార్, ఏఓ జోత్స్నారాణి తదితరులతో కలిసి డీడీ వేరుశనగ, వరి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వరి పంటకు యూరియాను అధికంగా వినియోగిస్తే అగ్గి తెగులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. వేరుశనగ పంటలో వేరుకుళ్లు తెగులు కనిపిస్తోందన్నారు. కాఫర్ ఆక్సీక్లోరైడ్‌ను మొదళ్లు తడిచే విధంగా పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న నాయకులు

విడవలూరు: సామాజిక పింఛన్ మొత్తాన్ని రూ.3వేలకు పెంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. విడవలూరులో నూతన పింఛన్లతో పాటు పెంచిన పింఛన్ నగదు రూ.3వేలును లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ వేణుంబాక భవానమ్మ,పార్టీ మండల గౌరవాధ్యక్షులు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీహరి రెడ్డి, సర్పంచ్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

దేశానికి సేవ చేయడం అదృష్టం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దేశానికి సేవ చేయడం అదృష్టంగా భావించాలని ఎన్‌సీసీ శిక్షకుడు అభయ్ విద్యార్థులకు సూచించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని డీఎల్‌ఎన్నార్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డ్రిల్, ఫైరింగ్, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షకుడు అభయ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశ సేవ చేయాలనే ఆలోచన కలిగి ఉండాలన్నారు. తద్వారా క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు ఎన్‌సీసీ శిక్షణ తోడ్పడుతుందన్నారు. ఏఎన్‌ఓ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిహ్నంగా బుచ్చిరెడ్డిపాళెం

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



10వ వార్డులో సీసీరోడ్డు శిలఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీని అభివృద్ధికి చిహ్నంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 4వ వార్డు శేషాద్రినగర్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎంపీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం 13వ వార్డు గాంధీనగర్‌లో ఎంపీ వేమిరెడ్డి కేటాయించిన ఎంపీ నిధులు రూ.10 లక్షలతో పార్క్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే జీజీ ఎంపీ నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం 17వ వార్డు పాత కాశీపాళెంలో అరకు ఎంపీ జీ మాధవి నిధులు రూ. 5 లక్షలు, పదో వార్డులో ఎంపీ వేమిరెడ్డి నిధులు రూ.5 లక్షలు, జీజీ ఎంపీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రజలు కోరిన సీసీరోడ్లు, అభివృద్ధి పనులను పూర్తిచేశామని తెలిపారు. అభివృద్ధిని చూసి రాబోయే ఎన్నికల్లో ఓటేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఆయా వార్డుల కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థినులతో ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 750 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పంపిణీ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని డీఎల్‌ఎన్నార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కొందరు పనికట్టుకుని విద్యార్థులకు ఇస్తున్న ట్యాబ్‌లపై విషప్రచారం చేస్తుండడం సిగ్గుచేటు అన్నారు.

20న మహారుద్రాభిషేకం

ఈ నెల 20న కొడవలూరు మండలం రాజుపాళెంలో శ్రీనారికేళ సహిత రసలింగేశ్వర మహారుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని మహారుద్రాభిషేకం నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా లక్ష కొబ్బరికాయలు, లక్ష రుద్రాక్షలు, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన, సుదర్శన యాగం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కోవూరు నియోజకవర్గంలోని ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం



పొదలకూరు : పట్టణంలోని మండల పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో పెన్షనర్ల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అసోయేషన్ అధ్యక్షుడు కే కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు పీ సోమానాయుడు, ఎస్ లక్ష్మీనారాయణ, ఎస్‌కే మస్తాన్‌సాహెబ్‌ను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ సెక్రటరీ కదిరి లక్ష్మీనారాయణ, ట్రెజరర్ మస్తానయ్య, జాయింట్ సెక్రటరీ జీ నారాయణరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు పొదలకూరు విద్యార్థి



వంశీకృష్ణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పొదలకూరు : స్థానిక డీఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎం వంశీకృష్ణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 6న పల్నాడు జిల్లా నర్సరావుపేటలో నిర్వహించనున్న అండర్-17 విభాగం అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో వంశీకృష్ణ పాల్గొననున్నట్లు హెచ్‌ఎం సనత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వంశీకృష్ణను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. పీఈటీ సునీత, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించి వైద్యుడి మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో అంగన్‌వాడీ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మె బాట పట్టడంతో కేంద్రాల నిర్వహణను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో డ్వాక్రా మహిళలకు అప్పగించారు. వీరు కేంద్రాల్లో సకాలంలో చిన్నారులకు పౌష్టికాహారం ఇస్తున్నారా..లేదా..అని జేసీ పరిశీలించారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. పెద్ద ఎత్తున ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడంపై జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి తహసీల్దార్ గున్నం మల్లికార్జున, వైద్యాధికారి ఎం.రామకృష్ణ, ఎంఈఓ-2 ఎన్.అంకయ్య, ఈఓపీఆర్డీ వీ డేవిడ్ తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యానికి వైఎస్సార్ కుటుంబం పెద్దపీట

• డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



నార్తురాజుపాళెంలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న చలపతిరావు



విడవలూరు: ఊటుకూరులో వైద్యసేవలు అందిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

కొడవలూరు: ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది వైఎస్సార్ కుటుంబమేనని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీరి చలపతిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంతో పాటు 108, 104 సేవల ద్వారా ప్రజారోగ్యానికి భద్రత కల్పించారని గుర్తుచేశారు. ఆయన బాటలోనే తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో పాటు సేవలను విస్తరించారని తెలిపారు. నాడు-నేడు ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. ప్రతి మూడు నెలలకు వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్యస్థితిని పరిశీలించేలా చర్యలు తీసుకోవడం మన ముఖ్యమంత్రికి ప్రజలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సురక్ష శిబిరంలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ప్రభుత్వమే రవాణా ఖర్చులు భరించి కార్పొరేట్ వైద్యశాలలకు తీసుకుపోయి వైద్యం అందిస్తుందని తెలిపారు. పేదల విద్య, ఆరోగ్యంపై ఇంతటి చిత్తశుద్ధి కనబరచే ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి ఉండడం మనందరి అదృష్టమన్నారు. అనంతరం గత ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, వైద్యాధికారి ఎం రామకృష్ణ, ఎంఈఓ జీ వసంతకుమారి, ఎంపీపీ జీ జ్యోతి, సర్పంచ్‌లు బీ సుప్రియ, నల్లావుల శ్రీనివాసులు, సొసైటీ చైర్మన్ డీ శివకుమార్, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎన్ మాణిక్యరావు, పంచాయతీ కార్యదర్శి జీ జాలయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే ప్రభుత్వ లక్ష్యం

విడవలూరు: ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందని ఎంపీడీఓ జీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఊటుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విడవలూరు పీహెచ్‌సీ డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, నాయకులు కొండూరు సాగర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసమూర్తి, వీఆర్వో భాస్కర్ పాల్గొన్నారు.

8 నుంచి విద్యార్థులకు పోటీలు

నెల్లూరు రూరల్: విజయవాడలోని స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మండల స్థాయిలో చిత్రలేఖన, వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను ఈ నెల 8 నుంచి నిర్వహించనున్నామని డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు అక్కడే బహుమతులను అందజేయనున్నామని చెప్పారు. నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయిలో పోటీలను ఈ నెల 11న నిర్వహించనున్నామని తెలిపారు. 12 నుంచి 15 ఏళ్లలోపు వారికి ఉదయం.. 16 నుంచి 18 ఏళ్లలోపు వారికి పోటీలను మధ్యాహ్నం నిర్వహించనున్నామని వివరించారు. పోటీలకు గంట ముందు వారి ఆధార్ కార్డుతో పూర్తి వివరాలను తెలుపుతూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలను అందజేయనున్నామని పేర్కొన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఏ కష్టమొచ్చిందో తెలియదు గానీ గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరులోని మాగుంట లేఅవుట్ సమీపంలో మూడో నంబర్ పట్టాలపై శుక్రవారం జరిగింది. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. పింక్ కలర్‌పై వైట్ కలర్ డిజైన్ కలిగిన ఫుల్ హ్యాండ్స్ చొక్కా, ఆరెంజ్ కలర్ లుంగీ ధరించి ఉన్నాడు. ఆత్మహత్య ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు.